ప్రారంభం సరే..
వినియోగం ఎప్పుడో..?

- కొత్త భవనం ప్రారంభించినా.. ఇరుకు గదిలోనే కొనసాగుతున్న తంగళ్లపల్లి మేజర్ జీపీ కార్యాలయం
- గ్రామస్తులకు తప్పని తిప్పలు

తంగళ్లపల్లి మండల కేంద్రంలోని నూతన గ్రామ పంచాయతీ భవనం

సిరిసిల్ల రూరల్, జూలై 19: తంగళ్లపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. ఈ ఏడాది జనవరిలో తంగళ్లపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని పాలకవర్గం అఘమోఘాల మీద ప్రారంభించింది. అయితే సర్పంచుల పదవీకాలం ముగియడం.. ప్రత్యేకాధికారుల పాలన వచ్చి ఏడు నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు నూతన గ్రామ పంచాయతీ భవానాన్ని వినియోగంలోకి తేవడం లేదు. నేటికీ ఇరుకు గదినే గ్రామ పంచాయతీ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ...?

తంగళ్లపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో పర్యవేక్షణ లోపంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. రోడ్లను శుభ్రం చేయకపోవడం, వీధిలైట్ల వెలుకపోవడం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ వెంకటలక్ష్మి వ్యవహరిస్తున్నారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డికి అనారోగ్య రీత్యా సెలవులో ఉండగా, ఇన్‌చార్జి కార్యదర్శిగా లక్ష్మీపూర్ జీపీ సెక్రటరీ కిష్టయ్యకు బాధ్యతలు అప్పగించారు. ఓ వైపు పాలకవర్గం.. మరో వైపు పూర్తి స్థాయిలో కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో వివిధ పనుల కోసం జీపీకి వచ్చే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో కార్యదర్శిని నియమం చి, మేజర్ గ్రామ పంచాయతీలో సత్వర సేవ లు అందించాలని కోరుతున్నారు.

ప్రస్తుతం కొనసాగుతున్న పాత గ్రామ పంచాయతీ భవనం

ఇబ్బంది పడుతున్నాం

పనుల కోసం గ్రామ పంచాయతీకి వస్తే కార్యదర్శి సరిగా ఉంటలేరు. కార్యదర్శి కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది. గ్రామంలో గతంలో మాదిరిగా పనులు అయితలేవు. రోడ్లు శుభ్రం చేస్తలేరు. వీధీ లైట్లు పోతే త్వరగా పెడ్తలేరు. సరిగా చూస్తలేరు. చెత్త కూడ తీస్తలేరు. పంచాయతీలో పూర్తి స్థాయి కార్యదర్శి లేకపోవడంతో ఇంటి అనుమతులు, ఆస్తి మార్పిడి, ఇతరత్రా పనులను జాప్యం చేస్తున్నరు.

– క్యారం జగత్,
గ్రామస్తుడు (తంగళ్లపల్లి)

భారీ వర్షాల దృష్ట్యా
అప్రమత్తంగా ఉండండి

- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు
- అందుబాటులో డీటీఎఫ్ బృందాలు
- విపత్కర సమయంలో 100కి డయల్ చేయండి
- ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి: మల్యాలలో లో లెవల్ వంతెనను పరిశీలిస్తున్న ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి

రాజన్న సిరిసిల్ల, జూలై 19 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహజన్ హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో జిల్లా భారీ వర్షాలున్నందున పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు తెలిపారు. డీఆర్ఎఫ్ బృందం అందుబాటులో ఉంటుందని, ఎవరైనా ఆపదలో ఉంటే 100కి డయ ల్ చేసి సహాయం పొందాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. మానేరు పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు, చెరువులు, మత్తడి దుంకే ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల వద్దకు వెళ్లవద్దన్నారు. పంట చేలలో విద్యుత్ మోటర్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. స్తంభాలు, వైర్లను తాకవద్దని, చెట్ల కింద, పాడైన భవనాల్లో ఉండవద్దన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తెగిపోయిన రోడ్ల వద్ద ప్లాస్టిక్‌కోన్స్, భారికేడ్స్, హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

జాగ్రత్తగా ఉండాలి: ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి

చందుర్తి, జూలై19: భారీ వర్షాలతో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రి నీరెడ్డి సూచించారు. చందుర్తి మండలం మల్యాల, జోగాపూర్ గ్రామాల్లోని లోలెవల్ వంతెనను శుక్రవారం ఆమె పరిశీలించారు. భారీ వర్షాల దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, కుంటలు నిండిన చోట, ఓవర్‌ఫ్లో అయిన చోట పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం చందుర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్క నాటారు. ఆమె వెంట చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

'రైతు భరోసా'
ఇంకెప్పుడిస్తరు?

చందుర్తి, జూలై 19: రైతు భరోసా ద్వారా ఎకరానికి ఏడాదికి ₹15వేల పెట్టుబడి సాయం ఇంకెప్పుడిస్తరు.. అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ ఎంపీపీ, మండల రైతు సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతు రుణమాఫీని స్వాగతిస్తున్నామని, లక్ష రూపాయల లోపు రుణాలు ఉన్న కొద్ది మందికి రుణమాఫీ చేసి సంబురాలు చేసుకోవడం సరికాదన్నారు. ప్రస్తుత వానకాల సీజన్ పనులు జరుగుతున్నప్పటికీ పెట్టుబడి సాయంపై పార్టీ శ్రేణులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కౌలు రైతు, రైతు భరోసా హామీని మరిచి రైతుభరోసా నిధులను రుణమాఫీకి మళ్లించి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రుద్రంగి, జూలై 19: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో శ్రీనివాస దీక్షితులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి ఆదేశానుసారం రుద్రంగి కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏడో తరగతి పాసైన సర్టిఫికెట్, నివాస ధ్రువీకకరణ పత్రం, ఆధార్ జిరాక్స్‌తో దరఖాస్తు ఫారాన్ని నింపి ఈ నెల 25లోగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సమర్పించాలని సూచించారు.

ఒడిశా స్టడీ టూర్‌కు జిల్లా మత్స్య కార్మికులు

ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఆక్వా కల్చర్‌ను సందర్శిస్తున్న జిల్లా మత్స్య కార్మికులు

రాజన్న సిరిసిల్ల, జూలై 19 (నమస్తే తెలంగాణ): అక్వాకల్చర్ విధానాన్ని పెంపొందించేందుకు జిల్లా మత్స్యశాఖ కార్మికులు అవగాహన కోసం ఒడిశా స్టడీ టూర్‌కు వెళ్లారు. జిల్లాలోని మధ్యమానేరు, ఎగువమానేరు, మల్కపేట రిజర్వాయర్, నిమ్మపల్లి ప్రాజెక్టుల్లో మత్స్య సంపద అభివృద్ధి చేయాలని, అందుకు ఆక్వా కల్చర్ విధానాన్ని చేపట్టేందుకు మత్స్య కార్మికులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానంపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా మత్స్యశాఖ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నది. ఈ క్రమంలో ఒడిశాలోని భువనేశ్వర్‌కు జిల్లా మత్స్యశాఖ చైర్మన్ చొప్పరి రామచంద్రం ఆధ్వర్యంలో సుమారు 50 మంది కార్మికులు తరలివెళ్లారు. సిఫా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాసెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. అక్వాకల్చర్ విధానం ద్వారా మత్స్య సంపద పెరిగి కార్మికులు ఆర్థిక పురోగతి సాధించవచ్చని చైర్మన్ రామచంద్రం తెలిపారు. జిల్లాలో భారీ ప్రాజెక్టులతోపాటు చెరువులు వందల సంఖ్యలో ఉన్నాయన్నారు. వీటిలో అక్వా కల్చర్ విధానాన్ని అమలు చేస్తే మత్స్య కార్మికులకు లాభసాటిగా ఉంటుందన్నారు.

టాయిలెట్లు కంపుకొడుతున్నయ్

- డ్రైనేజీ మరమ్మతులు చేపట్టండి
- అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థుల నిరసన

జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకుడు కంచర్ల రవిగౌడ్, విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 19: డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడై పరిసరాలు కంపుకొడుతున్నాయంటూ విద్యార్థులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలోని డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నడంతో పరిసరాలు దుర్గంధంతో కంపుకొడుతున్నాయని తెలిపారు. వానకాలం నేపథ్యంలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందన కరువైందన్నారు. టాయిలెట్స్ సమీపంలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారన్నారు. తక్షణమే భోజన గదిని మరో ప్రదేశంలో ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇక్కడ బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు మట్టె శ్రీనివాస్, నాయకులు నవీన్, రుద్రవేణి, సుజిత్, సాయి, తదితరులు ఉన్నారు.

చిన్న ఉద్యోగులను ఎట్ల అనుమతిస్తరు?

- రాజన్న ఆలయ ఉద్యోగుల ఆందోళన

వేములవాడ, జూలై 19: రాష్ట్రంలోనే అతిపెద్ద దేవాలయమైన రాజన్న ఆలయానికి చిన్న దేవాలయ ఉద్యోగులను ఎలా అనుమతిస్తారు.. అంటూ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉప్పుగడ్డ టీఎన్‌జీవో భవనంలో ఆలయ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. అగ్రహారం ఆలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ వేములవాడ రాజన్న ఆలయానికి డిప్యూటేషన్‌పై వచ్చేందుకు దరఖాస్తు చేసుకోవడాన్ని ఉద్యోగులు తీవ్రంగా తప్పుబట్టారు. జీవో నంబర్ 64 ప్రకారం సమాన స్థాయి దేవాలయానికి మాత్రమే డిప్యూటేషన్ కేటాయించాల్సి ఉండగా, పెద్ద ఆలయానికి అనుమతించవద్దనే నిబంధన ఉందని ఉద్యోగులు వాదించారు. అయితే ఈ విధానం కొనసాగితే మరిన్ని చిన్న దేవాలయాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా ప్రతిఘటించాలని నిర్ణయించారు. చిన్న దేవాలయ ఉద్యోగులను రాజన్న ఆలయానికి అనుమతించవద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డిని కలిసి వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం ద్వారా ఈ సారి ఆషాఢ మాసం బోనాలను ఈ నెల 26న నిర్ణయించనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఉద్యోగులు శ్యామ్, ఎల్ రాజేందర్, వంశీ, గిరి, అజయ్, చైతన్య, రాజు, తదితరులు ఉన్నారు.

పాత నివాసాల్లో ఉండవద్దు

వేములవాడ, జూలై 19: వానకాలం నేపథ్యంలో పాత నివాసాల్లో ఉండవద్దని మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో ఇప్పటికే గుర్తించిన పాత నివాసాలకు శుక్రవారం మున్సిపల్ సిబ్బంది హెచ్చరికల బోర్డులు వేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సాయికృష్ణ మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇండ్లల్లో ఉండవద్దని యజమానులకు సూచించినట్టు చెప్పారు. ఇప్పటికే 36ఇండ్లు గుర్తించి, యజమానులందరికీ నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ జిల్లాను ఆరెంజ్ జోన్‌గా పరిగణించిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

28న ముస్లిం కమిటీ ఎన్నిక

వేములవాడ, జూలై 19: వేములవాడ పట్టణ ముస్లీం కమిటీ ఎన్నికలను ఈ నెల 28న స్థానిక ఉర్దూ మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. శుక్రవారం అధ్యక్ష స్థానానికి మూడు నామినేషన్లు, కార్యదర్శి స్థానానికి ఒక నామినేషన్ దాఖలైనట్లు తెలిపారు. నామినేషన్ల పర్వం పూర్తికాగానే, ఈ నెల 21న పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు. ఇటీవల జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మొత్తం 920మంది సభ్యులు తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారని, 28న ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరుకు జరిగే పోలింగ్‌కు ఆధార్‌కార్డు గుర్తింపుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారులు సయ్యద్ సాధిక్, సయ్యద్ బాబా, ఎండీ రఫీక్, షకీల్, అజ్మత్, ఇష్తికార్, షబ్బీర్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జూలై 19: మర్రనపేటలో జవ్వాజి శేఖర్ ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కిందపడడంతో గాయాలయ్యాయి. రోజువారీగా కల్లు గీసేందుకు తాటిచెట్టు పైకి ఎక్కగా మోకా జారడంతో గాయపడ్డాడు. తోటి కార్మికులు సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు.

గురువులంటే అభిమానంతో..

- ఉపాధ్యాయుల బదిలీని తట్టుకోలేక బోరున విలపించిన విద్యార్థులు

ఎల్లారెడ్డిపేటలో ఉపాధ్యాయుడిని పట్టుకొని కంటతడి పెడుతున్న చిన్నారులు

ఎల్లారెడ్డిపేట, జూలై 19: తొమ్మిదేండ్ల అనుబంధంతో ఎనలేని అభిమానం సంపాదించుకున్న గురువు తమను వదిలి బదిలీపై వెళ్తున్నాడని తెలిసి.. ఆ చిన్నారులు కంటతడి పెట్టారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువును పట్టుకొని బోరున విలపించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలో గల ప్రాథమిక పాఠశాలలో 2015లో నలుగురు ఉపాధ్యాయులు రజిత, శ్రీనివాస్, అంజలి, బీ మంజుల బదిలీపై వచ్చారు. అప్పుడు పాఠశాలలో కేవలం 61మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు. ఈ క్రమంలో వారు పాఠశాలలో నాణ్యమైన బోధనతో తల్లిదండ్రులను ఒప్పించి విద్యార్థులను సంఖ్యను 160వరకు తీసుకెళ్లారు. గతేడాది మోడల్ పాఠశాలలో సీపీఎస్ విలీనం కావడంతో విద్యార్థుల సంఖ్య కొంత తగ్గింది. అయినప్పటికీ ప్రస్తుతం వందకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాలు బదిలీ కాగా, గురువారం పాఠశాలలో వీడ్కోలు ఏర్పాటు చేశారు. తమ గురువులను చూసి విద్యార్థులు బోరున విలపించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను పట్టుకుని విద్యార్థులు ఏడుస్తుండగా, వారిని వారించడం సదరు గురువుకు ఇబ్బందిగా మారింది.

మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల రూరల్, జూలై 19: తంగళ్లపల్లి మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 23మందికి, బహిరంగ ప్రాంతాల్లో తాగిన 18మందికి జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉదయశ్రీ జరిమానా విధించారని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.2వేలు, 9మందికి రూ.1,500, 11 మందికి రూ.వెయ్యి చొప్పున, బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగిన 18 మందికి రూ.210చొప్పున జరిమానా విధించారని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగవద్దని సూచించారు.

విద్యార్థులకు సన్మానం

కోనరావుపేట, జూలై 19: సుద్దాల గ్రామానికి చెందిన ఎర్రవల్లి అక్షిత, లక్కం అక్షయ త్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా, అంబేద్కర్ సంఘం అధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆక్షాంక్షించారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు.

ఆర్టీసీ డీఎంలుగా ప్రకాశ్‌రావు, శ్రీనివాస్

సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు

వేములవాడ డిపో మేనేజర్ శ్రీనివాస్

కలెక్టరేట్, జూలై 19: టీజీఆర్టీసీ సిరిసిల్ల డిపో మేనేజర్‌గా ఎ ప్రకాశ్‌రావు నియామకమయ్యారు. మెహదీపట్నం డిపో నుంచి ప్రమోషన్ ద్వారా సిరిసిల్ల డిపోకు బదిలీపై వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఆయన సిరిసిల్ల డిపోలో బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇదివరకు ఇక్కడ చేసిన ఎన్ మనోహర్‌ను కోరుట్ల డిపోకు బదిలీపై వెళ్లారు. నూతన డీఎం ప్రకాశ్‌రావుకు సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వెళ్తున్న డీఎం మనోహర్‌ను సిబ్బంది, అధికారులు సన్మానించారు. ఇక్కడ ట్రాఫిక్ ఇన్‌చార్జి రాజమౌళి, రామకృష్ణ, నర్సింహులు, ఏడీసీ రాంరెడ్డి, డిపో సిబ్బంది, ఉన్నారు.

వేములవాడ రూరల్, జూలై 19: వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా డీ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన మురళీకృష్ణ గద్వాల్ డిపోకు బదిలీకాగా, హైదరాబాద్ బస్‌భవన్‌లో విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ పదోన్నతి పై వేములవాడ డిపో మేనేజర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

అపూర్వ సమ్మేళనం

కోనరావుపేట, జూలై 19: మామిడిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు (1996-97వ సంవత్సరంలో ఎస్సెస్సీ బ్యాచ్) సమావేశమయ్యారు. శుక్రవారం వీరంతా శ్రీ సీతా రామస్వామి ఆలయ ఆవరణలో వేదికను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఒకరినొకరూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన చిలిపిచేష్టలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఉత్సాహంగా గడిపి, అనంతరం విందు చేశారు.

బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు

వేములవాడ టౌన్, జూలై 19: ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం వేములవాడ పట్టణంలోని ఉజ్వల స్కూల్, వాణీ విద్యాలయం విద్యార్థులు బద్ది పోచమ్మ అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. అందంగా అలంకరించిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య నెత్తిన బోనంతో విద్యార్థులు ఆలయానికి బయలుదేరారు. అమ్మవారు, పోతరాజుల అలంకరణతో సందడి చేశారు. ఈ సందర్భంగా అమ్మారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్స్ విక్కుర్తి అరుణాద్రి, బత్తిని రాములు, కరస్పాండెంట్స్ పంజాల వెంకటేశ్వర్లు, బద్ధం అనంతరెడ్డి, పిల్లి మహేశ్, తదితరులు ఉన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయాలి

కలెక్టరేట్, జూలై 19: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి లక్ష్యాలను పూర్తి చేసి, లబ్ధిదారులకు చేరవేయాలని డీఆర్‌డీవో శేషాద్రి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సమాఖ్య భవనంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, స్కూల్ యూనిఫార్మ్స్, మీ-సేవ కేంద్రాలు, పెరటి కోళ్ల పెంపకం, మదర్ యూనిట్స్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్ లెట్లు, మిల్క్ పార్లర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంబంధించిన అంశాలపై సిబ్బందితో సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. ఇక్కడ ఏడీ ఆర్డీవో గొట్టి శ్రీనివాస్, డీపీఎంలు, ఏబీఎన్‌లు, సీసీలు ఉన్నారు.

లేబర్ అధికారికి సన్మానం

కలెక్టరేట్, జూలై 19: కార్మికశాఖ జిల్లా అధికారిగా పని చేసి బదిలీపై వెళ్తున్న రఫీని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లోని లేబర్ అధికారి కార్యాలయంలో సన్మానించారు. అలాగే జిల్లాకు వచ్చిన లేబర్ ఆఫీసర్ నజీర్‌కు శాలువా కప్పి ఆహ్వానించారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఉన్నారు.

విద్యార్థినికి అభినందన

బోయినపల్లి, జూలై 19: కొదురుపాక జడ్పీ పాఠశాల విద్యార్థినికే మహేశ్వరి (9వ తరగతి)ని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అభినందించారు. కొదురుపాక జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదివే కే మహేశ్వరి ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య జీవన శైలిని ప్రోత్సహిస్తూ పోస్టర్ తయారు చేయగా, జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో మహేశ్వరిని డీఈవో అభినందించారు. అనంతరం జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు, హెచ్ఎం, విద్యార్థులు మహేశ్వరిని అభినందించారు.

పత్తి పంట పరిశీలన

వేములవాడ రూరల్, జూలై 19: జయవరం, మల్లారం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, వరి పంటను కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పత్తి పంటలో ఆకుమచ్చ, రసం పీల్చే పురుగుల ఉధృతిని గుర్తించినట్టు తెలిపారు. వరిలో ప్రధానంగా మొగి పరుగు లక్షణాలను రైతులకు వివరించారు. మొగి పురుగు నివారణకు, పత్తిపంటలో వచ్చిన ఆకుమచ్చ, రసం పీల్చే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాజేంద్రప్రసాద్, మధుకర్‌రావు, ఏఈవో సందీప్, రైతులు ఉన్నారు.

గోశాలను పరిశీలించిన ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి

వేములవాడ టౌన్, జూలై 19: రాజన్న ఆలయ గోశాలను శుక్రవారం రాత్రి ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి పరిశీలించారు. తిప్పాపూర్‌లో గల ఈ గోశాలలోని గోవులు, కోడెలకు అందిస్తున్న ఆహారం, వాటి స్థితిగతులను అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి శ్యామ్‌ను అడిగి తెలుసుకున్నారు. కోడెలకు ఇచ్చే పచ్చి గడ్డి, సోయాబీన్, పల్లి పిండి, తవుడును పరిశీలించారు. కోడెల ఆరోగ్య పరిస్థితి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సేంద్రియ ఎరువులతో అదనపు ఆదాయం

చీర్లవంచలో రాజన్న సేంద్రయ ఎరువు ప్యాకెట్లను అందజేస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

వేములవాడ రూరల్, జూలై19: సేంద్రియ ఎరువుల తయారీతో గ్రామ పంచాయతీలకు అదనుపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో తడి, పొడి చెత్తతో తయారు చేసిన సేంద్రియ ఎరువులను రాజన్న సేంద్రియ ఎరువుల పేరుతో గ్రామస్తులకు విక్రయించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ, తడి పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బంది అందజేస్తే సేంద్రియ ఎరువులను తయారు చేయవచ్చన్నారు. గతంలో జీపీ సిబ్బంది దాదాపు 5 క్వింటాళ్ల సేంద్రియ ఎరువును తయారు చేసి, కిలో రూ.20చొప్పున విక్రయించారన్నారు. ఐదు కిలోల బ్యాగ్‌ను విక్రయించడంతో గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. చీర్లవంచను